# గరగ నృత్యం

ఓం.... కారస్వరూపిణి ఆదిపరాశక్తి

ఆది పరాశక్తి యొక్క అంశయే పార్వతీ దేవి

పార్వతీ దేవి యొక్క పీఠంబులే ఊరూరా వెలసిన గ్రామదేవతలు

గ్రామదేవతల యొక్క ఉత్సవ విగ్రహాలే గరగలు

గ్రామదేవతలకు జాతర్లు చేయు సమయంలో పూజారి నియమ నిష్టలతో తల్లీ.... నీకు ఈ రోజు జాతరచేస్తున్నాము. కావున నీ యొక్క ప్రతిరూపాన్ని ఈ గరగలో ఆవహింపచేయమని కోరగా అప్పుడు అమ్మవారు ప్రతిస్వరూపం గరగలోకి ఆవహించునని, జాతర సమయంలో ధూప, దీప, నైవేద్యాలు చెల్లించి అనేకరకాల వాద్యాలు సమ్మేళనం చేయుచుండగా ఈ గరగ రూపంలో ఉన్న అమ్మవారిని పూజారి అందమైన దుస్తులు ధరించి కాళ్లకు గజ్జెలుకట్టుకొని తలకు పాగాచుట్టుకొని గరగరూపంలో ఉన్న అమ్మవారిని తలపై ధరించి అనేక రకాల వాద్యాలకు అనుగుణంగా నాట్యం చేస్తూ ఊరంతాత్రిప్పచుందురు. భక్తులు సమర్పించు నైవేద్యాలు, హారతులు స్వీకరించి భక్తులకు అమ్మవారు ఆయురారోగ్యాలు నొసంగునని ప్రజలయొక్క నమ్మకం.



గరగ అనగా "పాత్ర". గరగనాట్యంలో ఇత్తడిపాత్రలను, పసుపు కుంకాలతోను, రంగుగుడ్డలతోనూ అలంకరిస్తారు. ఈ పాత్రను నెత్తినపెట్టుకొని కళాకారులు నృత్యం చేస్తారు. పాత్రపైన ఐదుతలలుగల సర్పం యొక్క ప్రతిమను ఉంచుతారు.

పూర్వం గుళ్లలో మట్టితోచేయబడిన ఘటం గరగగా పిలవబడేది. వూరిలో గణాచారి అమ్మవారి ఉత్సవములరోజులలో ఈ ఘటాన్ని నెత్తిన పెట్టుకొని గ్రామంలోని అన్ని ఇళ్లకు తిరిగేవారు. గణాచారిని అమ్మవారి ప్రతిరూపంగా భావించి అమ్మవారి (గణాచారి) కాళ్లపై నీరుపోసి పూజించి అన్నము మరియు తినుబండారాలు సమర్పిస్తారు. గణాచారి వాద్యాలకు అనుగుణంగా నృత్యం చేసేది. గణాచారి సాధారణంగా రజక, కుమ్మరి, ఆసాది కులాలకు చెందినవారైవుంటారు. గణాచారులు నృత్యం చేస్తుండగా వారికి పూనకం వచ్చి పూనకంలో భవిష్యత్తు చెప్పేవారు. 12 నుండి 16 మంది కళాకారులతో ప్రదర్శించబడు అతిక్లిష్టమైన నాట్యకళారూపం గరగ. ఈ కళాకారులు కొంతమంది ఖాళీసీసాలను నెత్తినపెట్టుకొని గరగ నృత్యం చేస్తారు.

ఈ నాట్యం లో తాషాలు, వీరణము, డప్పులు మొదలయిన వాద్యాలు ఉపయోగించెదరు. ఈ నాట్యంలో చిందువేయటంలో డప్పుకు ప్రాధాన్యత ఎక్కువ. చిందుకు తగినట్లుగా డప్పులమోతలు ఊరంతా వినిపించేటట్లు సాగుతాయి. అలా ఊరేగుతూ వచ్చిన గరగలకు భక్తులు కానుకలు సమర్పించుకుంటారు.

గరగ కళాకారులు తూర్పుమరియు పశ్చిమగోదావరి జిల్లాలలోను మరియు విజయనగరం జిల్లాలలోనూ ఉన్నారు.

